గోకవరం మండల తహసీల్దారుగా శ్రీనివాస్

విశాలాంధ్ర - గోకవరం : గోకవరం మండల తహసీల్దారుగా ఎ. శ్రీనివాసు నూతనంగా తన పదవీ బాధ్యతలను ఆదివారం తహసీల్దారు కార్యాలయంలో స్వీకరించారు. ఈయన ఇంతవరకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తూ బదిలీపై గోకవరం మండల తహసీల్దారుగా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన కె. పోసి బాబు బిక్కవోలు మండల తహసీల్దారుగా ఆరు నెలలుగా రెగ్యులర్ తహసీల్దారుగా లేకపోవడంతో ఇన్‌చార్జి తహసీల్దారు చంద్రు దివ్యభారతి విధులను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దారును గోకవరం మండలం వీఆర్వో సంఘం అధ్యక్షుడు వివిబి సత్యనారాయణ, సహచర వీఆర్వోలు కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

కాకినాడ నుంచి వారణాసికి రైలు వేయండి

విశాలాంధ్ర - కాకినాడ : కేంద్ర రైల్వే శాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్‌ని కలిసి కాకినాడ పార్లమెంటుకు సంబంధించిన రైల్వే విషయాలు చర్చించారు. కాకినాడ నుండి వారణాశికి ప్రజలు, భక్తులు సౌకర్యం కోసం నూతన రైలు ప్రవేశ పెట్టాలని, తుని, పిఠాపురం, సామర్ల కోట, అన్నవరంలలో ప్రయాణికులు, వ్యాపారులు, భక్తులూ కోసం ముఖ్యమైన ట్రైన్స్ నిలుపుదల చేస్తూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, ముఖ్యంగా ప్రయాణికుల రద్దీ, వారి అవసరాలు గమనించి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్, స్లీపర్స్, బోగీల సంఖ్య పెంచాలని ప్రజలు తరుపున కోరారు. కొవ్వూరు - భద్రాచలం రైల్వేలైన్ కలపాలని, కాకినాడను మెయిన్ లైన్ విషయం 3వ లైన్ వేసే సమయంలో పరిశీలించాలని కోరారు.

పెన్షన్ల తొలగింపు దారుణం

విశాలాంధ్ర - మండపేట : పింఛన్లు రద్దు చేస్తామని లబ్ధిదారులకు సచివాలయం సిబ్బంది నోటీసులు జారీ చేశారని ఇది దారుణమని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుండి పింఛన్లు పెంపు చేస్తున్నామని ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించిన జగన్ రెడ్డి ప్రభుత్వం, ఇప్పుడు కోత విధించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మండపేట పట్టణానికి సంబంధించి 2404 రేషన్ కార్డు దారులకు 704 సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మిగిలిన మండలాల్లో సైతం నోటీసులు జారీ చేశారని దీంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాను ఆయా ఎంపీడీవోలతో సంప్రదించగా తమ ప్రమేయం లేకుండానే నేరుగా సచివాలయాల ద్వారా నోటీసులు వచ్చాయని పేర్కొన్నట్టు వెల్లడించారు. మండపేట నియోజకవర్గంలో ఏ ఒక్క పెన్షన్ రద్దయిన సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండపేట పురపాలక సంఘ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీ వరప్రకాష్, టీడీపీ టౌన్ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మాజీ కోఆప్షన్ సభ్యుడు జొన్నపల్లి సూర్యారావు, మాజీ కౌన్సిలర్లు బండి గోవిందు, సిద్ధిరెడ్డి రామకృష్ణ, కౌన్సిలర్ యరమాటి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి

విశాలాంధ్ర - మండపేట : భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పాయ్ 98వ జయంతిని మండపేటలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం 96వ బూత్ నందు వాజ్ పాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ భరతమాత ముద్దుబిడ్డ వాజ్ పాయ్ అన్నారు. ఆయనకు రాజకీయ ధురంధురుడుగా పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. నిస్వార్ధ పరుడైన వాజ్ పాయ్ 1968 నుండి1973 వరకు జనసంఘ్ అధ్యక్షునిగా వ్యవహరించారని తెలిపారు. అనంతరం ప్రతి నెలా చివరి ఆదివారం జరిగే ప్రధాని మోదీ మన్ కీ బాత్ రేడియో ప్రసంగాన్ని వారు వీక్షించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యుడు కోటిపల్లి సాయిరాం, యువమోర్చ జిల్లా కార్యదర్శి నాళం ఫణిప్రకాష్, కామవరపు శ్రీనివాస ప్రకాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభకార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

విశాలాంధ్ర-తాళ్ళపూడి : తాళ్ళపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి హెూంమంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా నరాలశెట్టి కాశీవిశ్వ నాథం, లక్ష్మీ దుర్గ ల కూతురు ప్రణవి ని హెూం మినిస్టర్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నరాలశెట్టి వేంకటేశ్వరరావు, ప్రశాంతి కుమారి, వీర వెంకటరావు, అరవకొండ, వీర్రాజు, నాగ మంగాణి, స్థానిక వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు. కుమారి ప్రణవి ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని హెూంమంత్రి తానేటి వనిత ఆశీర్వదించారు.

గుమ్మల దొడ్డిలో నగర సంకీర్తన

విశాలాంధ్ర - గోకవరం : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గోకవరం మండలం బొమ్మల దొడ్డి గ్రామంలో ఆదివారం రాజమహేంద్ర వరం నగరానికి చెందిన ఇస్కాన్ భక్తుల ఆధ్వర్యంలో మహా గ్రామ సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గుమ్మలదొడ్డి గ్రామంలోని శ్రీరామగిరి క్షేత్రం నుండి వాల్మీకి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు కీర్తన నిర్వహించారు. హరే కృష్ణ హరే కృష్ణ నామ జపంతో భక్తిశ్రద్ధలతో గ్రామంలోని ప్రధాన కూడళ్ళలో కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనలో నగర సంకీర్తన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మల్ల శ్రీను మాట్లాడుతూ ధనుర్మాసం ప్రారంభం నుండి నిత్యం సుమారు 150 మంది గ్రామస్తులు ఈ నగర సంకీర్తన కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ భక్తులు నందీశ్వర కృష్ణదాస్, నియాన్ ప్రభూజి, ఇస్కాన్ మాతాజీలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం తగదు

విశాలాంధ్ర - రాజోలు : తనపై కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేసి మనోభావాలు దెబ్బతీశారని తాటిపాక గ్రామానికి చెందిన ఒక వివాహిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన తమ దగ్గర బంధువు తన భర్త ఇంటి వద్ద లేని సమయంలో ఇంటికి వచ్చి తలుపు కొట్టగా మాకు తెలిసిన వ్యక్తి అని నా కుమారుడు నేను లోపలికి పిలిచామని అతను మంచినీళ్లు కావాలని అడగగా నేను లోపలికి వెళ్ళి గ్లాసుతో నీళ్లు తెస్తుండగా నాపై అత్యాచారం చేయబోయాడని వాపోయింది. నన్ను నేను రక్షించుకునే క్రమంలో కిటికీలో ఉన్న బ్లేడు అతని చేతి పై బలంగా విసిరానని, అది ఎక్కడ తగిలిందోకూడా తాను చూడలేదని తెలిపారు. ఇంతలో అతను పెద్దగా అరుస్తూ బయటకు పారిపోయాడుని, జరిగిన వాస్తవ సంఘటన తెలుసుకోకుండా కొంత మంది అక్రమ సంబంధం వలనే ఈ సంఘటన జరిగిందని, ప్రియుడు పై ప్రియురాలు దాడి చేసిందని పుకార్లు సృష్టించి తన కుటుంబ పరువు బజారుకు ఈడ్చారని ఆమె వాపోయింది. ఈ సంఘటన పై నిజానిజాలు తెలుసుకుని తనపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరుతోంది.

వరి ఉత్పాదన పెంపునకు మేలైన వంగడాలు

విశాలాంధ్ర - అమలాపురం : ఉత్పాదకత పెంచడంలో మేలైన అధునాతన వరి వంగడాలను ఎంపికతో పాటుగా మెరుగైన యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా రైతాంగానికి సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ కామన గరువు గ్రామంలో రబి సీజన్లో వరి నాట్లను వేసే విధానాలను పరిశీలించి సాగు క్షేత్రంలో వరి నాట్లు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్లో సాగునీటి సమస్యల ఉత్పన్నం కాకుండా తక్కువ కాల పరిమితి కలిగి అధిక దిగుబడుల నిచ్చే వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రైతాంగానికి సూచిం చారు. ఏటా సాగు చేసే సాంప్రదాయ రకాలకు బదులుగా కొత్త వరి వంగడాలను మీ ప్రాంతాలకు అనువైన, శాస్త్రవేత్తల సిఫార్సులకు అనుగుణంగా రైతులు విత్తనాలు ఎంపిక చేసుకొని మంచి దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. మారు తున్న సాంకేతికత పరిజ్ఞానం రైతులకు దరిచేరితేనే సాంకేతికతకు సార్ధకత చేకూరుతుందని ఆ దిశగా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్ర వేత్తలు రైతులను ప్రోత్సాహించాలన్నారు.

ఈ సందర్భంగా రైతులను ఆయన సాగు విధానాలపై ఆరా తీయగా రైతులు 125 రోజులు పంట కాలపరిమితి కలిగిన ఎంపియు 1121 రకం వరి వంగడాన్ని ఎంపిక చేసుకున్నారని స్థానిక గ్రామ సచివాలయ వ్యవసాయ సహా యకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కాకి నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు...

విశాలాంధ్ర - దేవరపల్లి : మండలంలో క్రిస్టమస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. క్రిస్టమస్ సందర్భంగా గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. క్రైస్తవ సోదరులు చర్చిలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించి అత్యంత భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

అంబాజీపేటలో : క్రైస్తవుల అతి పెద్ద పండుగ క్రిస్మస్ ఆదివారం మండలంలో భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో

ఉన్న అన్ని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు చేశారు. ఉదయం నుండి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ చోట్ల చర్చి నిర్వాహకులు విందులు ఏర్పాటు చేసారు. మాచవరం గ్రామ పరిధిలో పలు చర్చిల్లో పాల్గొని కేక్ కట్ చేసి దైవసేవకులకు మరియు సంఘస్తులు, గ్రామ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలను సర్పంచ్ నాగబత్తుల శాంతకుమారి సుబ్బారావు తెలిపారు. మండలంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో బిషప్ జల్లి జార్జి పాపప్, కుంచె రమణారావు, జడ్పిటిసి బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ హర్ష వర్ధన్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - సీతానగరం : శ్రీ హర్ష వర్ధన్ పాఠశాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను

నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రధాన ఆకర్షణగా శాంటా క్లాస్ వేషధారణ పిల్లలను అబ్బురపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కన్నబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడూ చదువులే కాకుండా ఇటువంటి కార్యక్రమాల వల్ల మానసికంగా ఉల్లాసంగా కలిగి చదువుల పై మరింత ఆసక్తి కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో: మండల కేంద్రంలో ఉన్న సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను కన్నుల పండగ నిర్వహించారు. చర్చి పాస్టర్, సంఘ

పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబి, ప్రజాభిమాని, ఎంపిటిసి కాళ్ళ దొంగబాబు పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు క్యాండిల్ వెలిగించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దైవ సేవకులు సాలెంరాజు, మాసా జాన్‌లు క్రీస్తు పుట్టుకను విపులంగా వివరించడమే కాకుండా వారు అందించిన క్రైస్తవ సందేశం అహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సంఘస్తులు ఆలపించిన క్రైస్తవ గీతాలు, చిన్నారులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యాంతం ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తూము చిన్నబాబు, ఆడారి బాబ్జి, నక్కా అప్పలరాజు, మాదిరెడ్డి సూరిబాబు, సంఘ పెద్దలు కట్టు సూరిబాబు, గుద్దాటి శాంతిరత్నం, పలువురు యూత్ సభ్యులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హితకారిణి సమాజాభివృద్ధికి మునెమ్మ కృషి

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నియమించిన కార్పోరేషన్ చైర్మన్ల ఏలుబడిలో అవి అభివృద్ధి చెందాయో లేదో గాని రాజమండ్రిలో కీ.శే. కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపించిన హితకారిణీ సమాజం గతకాలపు నిర్లక్ష్యపు నీడలు, భూ ఆక్రమణలు, అవినీతి చెదలు వదుల్చుకుని గోదావరి జిల్లా వాసుల్లో కొత్త ఆనందానికి బీజం వేసిందని చెబుతున్నారు. దానికి గత ఏడాది హిత కారిణి సమాజానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన చైర్మన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంకి చెందిన కాశి బాలముని కుమారి (మునెమ్మ) వల్లే సాధ్యమైందని చెబుతున్నారు. ఒక నిజాయితీ కలిగిన కార్యకర్తకు పదవినిస్తే అభివృద్ధి ఎలా జరుగుతుందో కాశి బాలముని కుమారి నిరూపించారని కేవలం ఏడాది కాలంలో పలు సంస్కరణలు చేసి చూపించారని రాజమండ్రి నగర ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా పలుచోట్ల దురాక్రమణకు గురవుతున్న హితకారిణీ సమాజం భూములు ఎక్కడికక్కడ సర్వే చేయించి సెంటు భూమి కూడా బయటకి పోకుండా కట్టడి చేసి ఆక్రమణలు తొలగించి భూములను అన్యాక్రాంతం కాకుండా అడ్డుకట్ట వేశారని పలువురు హితకారిణీ అభిమానులు కొనియాడుతున్నారు.

నేడు సీపీఐ స్తూపం ఆవిష్కరణ

విశాలాంధ్ర - రాజోలు : భారత కమ్యూనిస్టు పార్టీ 98వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సఖినేటిపల్లి మండలంలోని గొంది శాంతినగర్‌లో నూతనంగా నిర్మించిన భారత కమ్యూనిస్టు పార్టీ స్థూపం ఆవిష్కరణ జరుగుతుందని రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి చెల్లుబోయిన కేశవశెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, విశిష్ట అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేగ ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు, రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - గండేపల్లి : సుమారు 30 సంవత్సరాల నుంచి ఉన్న సమస్యను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చేతుల మీదుగా నెరవేరడంతో పలువురు నాయకులు, గ్రామస్తులు, అభినందనలు తెలిపారు. ఆదివారం గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ శివారున ఉన్న సమస్య పరిష్కరించేందుకు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఫిబ్రవరి నెలలోగా నిర్మాణ పనులు పూర్తి చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. దాంతో గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఊరు మధ్యలో నుంచి పుష్కరకాలువ శివారునున్న ప్రాంతవాసులకు రహదారి కల్పించినప్పటికీ, ఒక్క మనిషి మాత్రమే వెళ్లే విధంగా ఉండటంతో, అనారోగ్యం పాలైనప్పుడు గర్భిణీ స్త్రీలను ఆసుపత్రికి తీసుకు వెళ్ళేటప్పుడు, స్మశాన వాటికి వెళ్లే సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్న నెరవేరలేదని, అటువంటి సమస్యను పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కంకణం కట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, వైస్‌ఎంపీపీ కుంచే రాజా, మండల పార్టీ అధ్యక్షులు కందుల చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విజయమే ధ్యేయంగా పనిచేయాలి

విశాలాంధ్ర - గోపాలపురం : రాబోయే ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా జనసైనికులు సమైక్యంగా పనిచేయాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కరాటం సాయి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జనసేన పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల, నాయకుల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు పోలనాటి రాజేంద్ర అధ్యక్షతన జరిగింది. ముందుగా కార్యకర్తల మనోభావాన్ని నాయకులు అడిగి తెలుసుకున్నప్పుడు నాయకుల సహకారం లేని కారణంగానే గ్రామస్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ కునారిల్లుతోందని ఆవేదనను వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి కరాటం సాయి మాట్లాడుతూ ప్రతి పార్టీ ప్రారంభంలో పురిటి నొప్పులతో బాధపడిందేనని కార్యకర్తలు మొక్కవోని ధైర్యంతో నిలబడి జెండాను ముందుకు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అచ్యుత సత్యనారాయణ, ఎంటర్పాటి రాజు, కూలినాటి రాజేంద్ర, పనసల వేణు మాధవి, కవల సీత, పలివెల శ్రీను, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.

లవ్ ఇన్ యాక్షన్ మినిస్ట్రీస్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో ఉన్న లవ్ ఇన్ యాక్షన్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమని పలువురు కొనియాడుతున్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని లవ్ ఇన్ యాక్షన్ మినిస్ట్రీస్..ఫౌండర్, ప్రెసిడెంట్ ఇందుర్తి జాన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ దైలాపల్లి మేరీ ఆధ్వర్యంలో గ్రామంలోని నిరుపేదలకు నిత్యవసర వస్తువులు, వంట సామాన్లు పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ కుమార్, మేరీలు మాట్లాడుతూ లవ్ ఇన్ యాక్షన్ సంస్థ స్థాపించి గత ఐదు సంవత్సరాలుగా గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, నిరుపేదలకు వంట సామాన్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా క్రిస్మస్ వేడుకలు సందర్భంగా గ్రామంలో నిరుపేదలకు వంట సామాన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. భవిష్యత్తులో సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసామన్నారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది నిరుపేదలకు వంట సామాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంట సామాన్లు, సరుకులు తీసుకున్న పలువురు జాన్ కుమార్, మేరీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తదేకం ఫౌండేషన్ సహకారంతో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు

విశాలాంధ్ర - పిఠాపురం : తదేకం ఫౌండేషన్ సహకారంతో సుమారు 15 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను జనసేన ఉభయగోదావరి జిల్లా కోఆర్డినేటర్ చల్లా లక్ష్మీ అందించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ తమ అధినాయకుడు పవన్ కళ్యాణ్ సేవా కర్తని కొనియాడారు. ఇప్పటికే జనసేన ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 150 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నడపమని ఆమె అన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

సంక్రాంతి కోడిపందాలపై ఉక్కు పాదం

విశాలాంధ్ర - అమలాపురం : కోనసీమలో కోడి పందాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని కోడి పందాల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని ఏలూరు రేంజ్ డిఐజి పాలరాజు హెచ్చరించారు. శని వారం అమలాపురం విచ్చేసిన డిఐజి పాలరాజు తెలిపారు. కోనసీమ అల్లర్ల నేపథ్యంలో అన్ని సామాజిక వర్గాల మధ్య స్నేహ భావం ఉండేలా చర్యలు తీసుకుంటామని మిగిలిన నిందితుల అరెస్టుల కంటే కోనసీమలో ప్రశాంతతే ముఖ్యమని ఆయన అన్నారు.

పూర్తైన సచివాలయ కన్వీనర్ల నియామకాలు

విశాలాంధ్ర - అనపర్తి : పార్టీ ఆదేశాల కనుగుణంగా నియోజకవర్గ పరిధిలోని సచివాలయ కన్వీనర్ల నియామకం పూర్తి చేసినట్టు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పరుపుల సుబ్బారావు తెలిపారు. ఆదివారం స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసిన వరుపుల సుబ్బారావు, అనపర్తి మండల పార్టీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు)తో కలసి నియోజకవర్గ స్థాయిలోని సచివాలయాల కన్వీనర్ల నియామకాలపై తుది పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు, సేవా తత్పరత ఉత్సాహం కలిగిన కార్యకర్తలను సచివాలయ కన్వీనర్లుగా నియమించడం జరిగిందన్నారు. అనంతరం కన్వీనర్లుగా ఖరారు చేసిన పేర్లను సుబ్బారావు ప్రకటించారు. జాబితాను రాష్ట్ర కార్యాలయానికి కూడా అందజేయడం జరుగుతుందని వరుపుల చెప్పారు.

ఆంజనేయస్వామి జాతరకు రాట ముహూర్తం

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి మండలం కుతుకులూరులో వచ్చే జనవరిలో కనుమ రోజున జరిగే శ్రీ భక్తాంజనేయ స్వామి జాతర మహెూత్స వానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం రాట ముహూర్తం చేశారు. దీనికి ముందు ఎమ్మెల్యే సత్తి దంపతులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకులు వరపుల సుబ్బారావు, నల్లమిల్లి దుర్గా వర ప్రసాద్ రెడ్డి (ఎన్‌డిఆర్), వైస్ ఎంపీపీ పులగం బుల్లి రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి పడాల శ్రీనివాసరెడ్డి, ఇంకా పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి జయంతి

విశాలాంధ్ర - కాకినాడ : భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి సేవలను భారత దేశ ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటారని అందుకే వారి పాలనను దేశవ్యాప్తంగా ప్రజలందరూ సుపరిపాలన దినోత్స వంగా జరుపుకుంటున్నామని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ కొనియాడారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కోశాధికారి చోడిశెట్టి రమేష్ అధ్యక్షతన జరిగిన అటల్ జీ 98వ జయంతి కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాల్గొని మాజీ ప్రధాని సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విజయరామయ్య, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్రీ సత్యనారాయణ రాజు, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు అనపర్తి వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పాజీ, కాకినాడ నార్త్ మండలం అధ్యక్షులు యార్లగడ్డ రాయుడు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహిని కేశవస్వామి ఆలయాన్ని దర్శించుకున్న మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ర్యాలీ శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వాహణాధికారి కృష్ణ చైతన్య ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద పండితులచే వేద ఆశీర్వచనాలు పలికి స్వామివారి దర్శనానంతరం స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉమ్మిడిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి సందర్భంగా బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ సలాది రామకృష్ణ, యువమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కాళాబత్తుల చిన్నారి, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు వానపల్లి శేషగిరిరావు, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు నందం శ్రీలక్ష్మి, జిల్లా ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి పొనుగపాటి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సంపాతి కనకేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు వెలికితీసేందుకు శిక్షణ దోహదం

విశాలాంధ్ర - రాజానగరం : మహిళల్లో అంతర్లీనంగా దాగిన నైపుణ్యాలు వెలికితీసేందుకు శిక్షణ తరగతులు దోహదపడుతాయని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని దివాన్ చెరువు గ్రామంలో రెండు రోజులు పాటు మహిళలకు ఉచితంగా అందించనున్న గ్లాస్ పెయింటింగ్ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో ఆత్మస్థైర్యం పెంచడంతో పాటు ఆర్థిక వనరులు అందించాలనే ఉద్దేశ్యంతో తమ సంస్థ వివిధ శిక్షణ తరగతులు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. మారుతున్న సమాజంతో పాటుగా మహిళలు కొత్త కొత్త కళాలపై నైపుణ్యాలు నేర్చుకోవడం మంచిదని సూచించారు. కేవలం రెండు రోజుల వ్యవధిలో శిక్షణ పూర్తియైనప్పటికి నేర్చుకున్న కళలు ఎక్కువకాలం మన్నుతాయని తెలిపారు. తొలుత శిక్షణకి హాజరైన మహిళకు ఉచితంగా శిక్షణ సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, సుంకర వీరాస్వామి, శిక్షకురాలు మల్లు లక్ష్మి దేవి, ఫణి, సురేష్, ఆనంద్, తేజ, పద్మాంజలి, సిబ్బంది గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.